స్కెచ్

# విఘ్ననాయకుడు

బులుసు-జీ-ప్రకాశ్

శ్రీకృష్ణ చైతన్య పరుగు పరుగున పారివచ్చాడు నా దగ్గరకు. వాడికి ఏడేళ్లుంటాయ్.

"విఘ్నేశ్వరుడంటే ఏమిటండి మేష్టారూ?" అన్నాడు.

"ఏమిటేమిట్రా? విఘ్నేశ్వరుడు వస్తువు కాదురా, దేవుడు" అన్నాను.

"అంటే?" అన్నాడు.

వీడికెంత చెప్పినా బోధ పర్చుకోలేడని నాకు తెలుసు. దేవుడిని గురించి వివరంగా చెప్పమంటే నా తరం కాదు. అంచేత కృష్ణ చైతన్యని మరో విధంగా సంతృప్తి పరచాలనుకున్నాను.

"వాడో మనిషి" అన్నాను గమ్మత్తుగా.

"నాక్కావల్సింది అదికాదు మేష్టారూ." అన్నాడు.

"అయితే వాడు పార్వతీదేవి కొడుకురా." అన్నాను.

వాడప్పటికీ సంతృప్తి చెందినట్లు లేదు. మొహం చిట్లించుకుని "సరేలెండి." అని వెళ్ళిపోయాడు.

కృష్ణ చైతన్య అభిప్రాయమేమిటో నాకేం అవగాహన కాలేదు. బళ్ళో ఇంతమంది పిల్లలకి పాఠాలు చెబుతానుగాని వీడికి చెప్పడంమాత్రం బహు కష్టం. ఉండి ఉండి ధర్మ సందేహాలు తెచ్చి పడేస్తూంటాడు. ఆ సంధిగ్గా లెల్లాటివంటే, చివరికి మేష్టారైన నేను సైతం తీర్చలేనివి. బడిపిల్లలు చైతన్యలాగే కొన్ని చిక్కు ప్రశ్న లడగ్గానే, రాకపోయినా రాదనకుండా ఏదో చెప్పేస్తూంటాను. వాళ్లు నాసమాధానం తప్పయినా, ఒప్పుగానే భావించి సంతృప్తి చెందుతారు. నవ్వుకుంటూ చల్లగా వూరుకుంటారు. కాని కృష్ణచైతన్య మాత్రం అందరి పిల్లలవంటి వాడు కాడు. వాడికి నేనెంత చెప్పినా, మొహం ప్రక్కకు పెట్టి అనంగీకారాన్ని సూచిస్తాడు, నాకన్నా వాడికెంతో తెలిసినట్లు. వాడిని నేనేమీ అనలేను. చిన్నవాడు. కొట్టడమనే దురలవాటు నాకు లేదు.

మర్నాడు చైతన్య లెక్కల మేష్టారిదగ్గర కెళ్ళి-"విఘ్నేశ్వరుడంటే ఏమిటండీ?" అనడిగాడు.

శ్రీకృష్ణ చైతన్య నాదగ్గరకు రావడం, వాడు ప్రశ్న వేయడం, నేను జవాబిచ్చినా వాడు తృప్తిపడకపోవడం లెక్కల మేష్టారికి నేనింతకుముందే చెప్పేశాను. అంచేతాయన "విఘ్నేశ్వరుడంటే వినాయకుడురా బాబూ." అన్నారు.

"నాక్కావల్సిం దదికాదండీ." అంటూ వెళ్ళిపోయాడు.

తరువాత మూడో క్లాసు మేష్టార్ని— "విఘ్నేశ్వరుడంటే ఏమిటండీ?" అనడిగాడట. ఆయనకూడా చైతన్యసంగతి తెలిసినవారు కాబట్టి—"గణపతిరా నాయనా." అన్నారు.

"సరే లెండి." అని మొహం చిట్లించుకున్నాడు చైతన్య.

"విఘ్నేశ్వరుడంటే అర్థం ఏమిటో సరిగ్గా ఏ మేష్టారూ చెప్పలేకపోతూారు. ఛీ!" అన్నాడు కృష్ణచైతన్య నాకు వినబడేటట్లు.

"విఘ్నేశ్వరుడంటే విఘ్నం కలుగజేయకుండా కాపాడేవాడని అర్థంరా అబ్బాయీ." అన్నాను.

శ్రీకృష్ణ ఒక్కసారి నా దగ్గరికెగిరి— "మేష్టారూ! రైటుగా చెప్పారండీ! మొదటే ఇల్లా చెప్పారు కారేం?" అన్నాడు.

అమ్మయ్య, ఇదా వీడి వుద్దేశం! వీడికొక్కావల్సింది విఘ్నేశ్వరుడు యెవడి కేమవుతాడని కాదు. విఘ్నేశ్వరుడనే మాటకి వ్యుత్పత్త్యర్థం.

వాడిని నేను సరిగ్గా సంతృప్తిపరచినందుకు గర్విస్తున్నాను. ఇంతలో—"మేష్టారూ!"

అన్నాడు చైతన్య.

"ఏంరా!" అన్నాను.

"మీరు చెప్పింది తప్పు. మా మేస్టరు గారన్నదీ తప్పు. అమ్మమ్మ చెప్పిందీ తప్పే!" అన్నాడు. నేనాశ్చర్యపోయి 'అదేమిట్రా?' అన్నాను.

"ఔను! మా అమ్మమ్మ ఏంచెప్పిందంటే, విఘ్నం కలిగించేవాళ్ళని శిక్షించేవాడని చెప్పిందండీ. అదీ తప్పే. మా అమ్మ ఏం చెప్పిందంటే అంటే అతన్ని పూజించకపోతే విఘ్నం కలుగచేస్తాడని. మీ రెవ్వరిమీదా నాకు నమ్మకంలేదు. పోయి నేనే కనుక్కుంటాను" అని వెళ్ళిపోయాడు.

ఇంత స్వల్ప విషయంలో ఇంతమంది పంతుళ్ళ వాళ్లముండి శ్రీకృష్ణచైతన్యని తృప్తిపరుని చేయలేక పోయామని నాకు చాలా సిగ్గేసింది!

ఇంతకీ నిజం చెప్పవలసొస్తే, విఘ్నేశ్వరుడంటే, విఘ్నంకలిగించకుండా రక్షించేవాడో విఘ్నం కలుగచేసే వాళ్ళని శిక్షించేవాడో, లేక ఉండ్రాళ్ళని భక్షించేవాడో నాకు తెలియక తికమక పడుతున్నాను. నేనేమిటి? మా పంతుళ్ళమంతాను!

కృష్ణచైతన్య గభాలున వొచ్చాడు.

"మేస్టారూ!" అన్నాడు.

"ఏరా?" అన్నాను శాంతంగా.

"విఘ్నేశ్వరుడంటే అర్థం ఇప్పుడు సరైనది తెలిసిందండీ." అన్నాడు.

"ఏమిట్రా?" అన్నాను అప్రయత్నంగా—నాకు చాతకానట్లు.

"మనకి ఆంధ్ర రాష్ట్రం రాకుండా విఘ్నం కలిగిస్తూన్న బొజ్జరాయుళ్ళందర్నీ విఘ్నేశ్వరులంటారండీ." అన్నాడు.

నేను తెల్లబోయాను.

# విఫలయజ్ఞం

ఇదె సమస్యా విచిత్రమ్ము; ఈ మహాంధ్ర
రాష్ట్ర రథ గమనమ్ము లీలా విధాన
నీడగా కనుపట్టు క్రీనీడ యౌ ని
దేమి స్వామీ! మహాంధ్ర మహీతలమ్ము!
ఏవో నిశ్వాస నైరాశ్య భావ కళిక
మా ముఖాల ముద్రపడి తమః రజస్సు
పులుముకొన్నది స్వామీ! నభో ప్రవీథి
మీ యరుణ కిరణాలు క్రమ్మింపరేమి?
ఏదో వేదన తెరపేలి కృత సుషుప్తి
లోన నొత్తిగిలితి మంతెకాని మాకు
పూర్ణ జాగృతి కాదు తమో విశాల
ఘోర జీమూతములు గిరికొన్న నింగి.
మీ తపస్సు ఫలించి, స్వామీ! మహాంధ్ర
సీమలోక మహాజ్యోతిః ప్రస్పృతి వెలుంగు
నని తలంచుకొంటి మంతె! యింధనములారి
యజ్ఞ విచ్ఛిన్నత తలంపు లనుకోలేదు!

—దోగిపర్తి వెంకటరమణ